# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | VIKARABAD




ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

## తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు..

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

- మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు బోధించాలి
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- వికారాబాద్ జిల్లాలో ప్రతిభ చాటిన 39 మంది టీచర్లకు సన్మానం

వికారాబాద్, సెప్టెంబర్ 5 : మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు బోధించాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 39 మంది టీచర్లను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఈవో రేణుకాదేవిలతో కలిసి ఆయన శాలువాలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ..మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయిపూలే, అంబేద్కర్ విద్య ప్రాధాన్యాన్ని గుర్తించారని.. ఆ మహనీయులను స్మరించుకుంటూ చిన్నారులకు బోధించాలన్నా రు. ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని.. జీవితాలను మలుపుతిప్పే శక్తి కేవలం గురువులకు మాత్రమే ఉం టుందన్నారు. మన ఎదుగుదలకు కారకులైన గురువులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ తనకు చదువు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ 20 ఎకరాల్లో సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. విద్యతోనే దేశ రూపురేఖలను మార్చొచ్చని చెప్పిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. తనకు మొట్టమొదటి గురువు తన తల్లియేనని చెప్పారు. జిల్లాలో 951 పాఠశాలలుండగా ఇప్పటికే 250 బడుల్లో మౌలిక వసతు లు కల్పించామని.. మిగతా పాఠశాలల్లోనూ ఆ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మనం ఉన్నత స్థాయిలో ఉన్నామంటే అందుకు కారణం గురువులేనని స్పష్టంచేశారు. అనంతరం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సిటీ ప్రశ్నార్థకం

### గ్రేటర్ రోడ్లపై మళ్లీ చెత్త డబ్బాలు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో చెత్త సమస్య జటిలంగా మారింది. గార్బేజ్ ఫ్రీ సిటీయే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాలు పడుతున్న వేళ.. కాలనీలు, బస్తీలు కంపుకొడుతున్నాయి. డెంగీ, మలేరియా ఇతర రోగాలతో ప్రజలు సతమతమవుతున్నా.. మేయర్, కమిషనర్ మొదలు జోనల్ కమిషనర్ల వరకు పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి తనిఖీలు జరపడంలేదు. పారిశుధ్య నిర్వహణలో లోపాలను సరిదిద్ది... 'స్వచ్ఛ హైదరాబాద్'కు మెరుగైన ర్యాంకింగ్ లక్ష్యంగా కృషి చేయాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. డస్ట్ బిన్ లెస్‌సిటీగా మార్చే లక్ష్యంలో భాగంగా బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను తీసేసిన అధికారులు.. తాజాగా డంపర్‌బిన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి విడతగా మార్కెట్లు బహిరంగ ప్రదేశాలు కలిపి 28 చోట్ల డంపర్‌బిన్స్ (పెద్ద చెత్త డబ్బాలు) ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు బల్దియా డంపర్‌బిన్స్ ఏర్పాటు చేయాలని రాంకీ ఏజెన్సీని ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే 'స్వచ్ఛ హైదరాబాద్' లక్ష్యం ప్రశ్నార్థకంగా మారుతుంది.

#### బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా..

స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా.. డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా మార్చాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను దాదాపు 800 చోట్లకుపైగా తగ్గించే కార్యక్రమాలను అమలు చేసింది. పెరిగిన జనాభా, కాలనీల్లో చెత్త ఉత్పత్తి పెరుగడంతో అందుకు అనుగుణంగా తరలించే స్వచ్ఛ ఆటోలు, వాహనాలను పెంచుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఇంటి నుంచి చెత్తను ఆటోల్లో ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు, అటు నుంచి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే రోడ్లపై చెత్త ఉన్నా అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో రహదారులపై వ్యర్థాల సమస్య తీవ్రరూపం దాల్చుతున్నది.

#### నీరుగారుతున్న స్వచ్ఛ లక్ష్యం

గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది. 'స్వచ్ఛ సర్వేక్షణ్-2024'లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతున్నది. గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా..రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) జీహెచ్‌ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి.. వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగలేదని, తన డివిజన్‌లోనూ చెత్త ఎత్తడం లేదని సంబంధిత అధికారులపై మండిపడడం గమనార్హం.



గురువులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, కలెక్టర్ శశాంక తదితరులు

## నవ సమాజ నిర్మాతలు గురువులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- జిల్లాను విద్యారంగంలో ముందుంచాలి : కలెక్టర్ శశాంక
- రంగారెడ్డి జిల్లా పరిషత్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్, డీఈవో సుశీందర్‌రావు, జడ్పీ సీఈవో

రంగారెడ్డి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : గురువులు నవ సమాజ నిర్మాతలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 170 మందిని శాలువాలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులది అత్యున్నత స్థానమని, భావిపౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు వెళ్లడం లేదని, ఇందుకు కారణం ఎవరు? ఈ పాపం ఎవరిది? అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ టీచర్ల కృషి పాఠశాలల భవితను మార్చేలా ఉండాలన్నారు. జిల్లాను విద్యారంగంలో ముందుంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, డీఈవో సుశీందర్‌రావు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## భారీ నిర్మాణాల వద్ద చైల్డ్ కేర్ సెంటర్లు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో చిన్నారులపై వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకున్నది. భారీ నిర్మాణ ప్రదేశాల్లో చైల్డ్ కేర్ సెంటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.

## వరద బాధితులకు కార్పొరేటర్ల విరాళం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద బాధితుల సహాయార్థం ఒక్క నెల వేతనాన్ని విరాళమిచ్చేందుకు కార్పొరేటర్లు ముందుకొచ్చారు. సంబంధిత మొత్తాన్ని కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి అందజేయనున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.



## గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావం తో గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. గురువారం రాత్రి 8 గంటల వరకు రాజేంద్రనగర్, దాని పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా 3.50 సెం.మీలు, సికింద్రాబాద్ పాటిగడ్డలో 1.70, బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, ముషీరాబాద్, అంబర్‌పేటలలో 1.65, ఖైరతాబాద్, నాంపల్లి ప్రాంతాల్లో 1.50, మూసాపేట, ఉప్పల్ మూసారాంబాగ్, బతుకమ్మకుంట ప్రాంతాల్లో 1.4 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతోపాటు బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో రాగల రెండ్రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.

## సైన్స్ విభాగాలకు చోటేది?

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బెస్ట్ టీచర్ అవార్డుల్లో ఓయూ సైన్స్ విభాగాలకు చోటు దక్కకపోవడంపై ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీకి లేఖ పంపించారు. బెస్ట్ టీచర్ అవార్డు పొందిన అధ్యాపకులను అభినందించారు. వారు అందించిన సేవలకు సరైన గుర్తింపు లభించిందన్నారు. సైన్స్ కళాశాల్లోని 18 విభాగాల్లో ఒక్కరిని కూడా అవార్డులకు ఎంపిక చేయకపోవడం శోచనీయమన్నారు. సాధారణంగా ఏటా సైన్స్, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, కామర్స్, ఇంజినీరింగ్ విభాగాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారని గుర్తు చేశారు. ఈ ఏడాది సైన్స్ విభాగాల నుంచి ఒక్కరినీ ఎంపిక చేయకపోవడం ఆ విభాగాల అధ్యాపకులను తీవ్రంగా నిరుత్సాహపరిచిందన్నారు. సైన్స్ విభాగాలకు చెందిన అధ్యాపకుల ప్రొఫైల్స్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని ఓయూ అధికారులకు సూచించారు. సైన్స్ కళాశాల అధ్యాపకుల సేవలను పరిగణనలోకి తీసుకోకుండా న్యాక్ గుర్తింపునకు వర్సిటీ ఎలా దరఖాస్తు చేస్తుందని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో ఎటువంటి న్యాక్ గుర్తింపును అధికారులు ఆశిస్తున్నారో స్పష్టం చేయాలన్నారు.

యూనియన్ బ్యాంకులో బ్యాంకు, ఆధార్ వివరాలను సిబ్బందికి అందిస్తున్న మహిళలు, యువకులు



# ఇంకెంత కాలం..?

## కొనసాగుతున్న రుణమాఫీ సర్వే

- ఆధార్ అనుగుణంగా బ్యాంకు ఖాతాల్లో పేర్ల మార్పిడికి తాజాగా అవకాశం కల్పించిన ప్రభుత్వం
- మళ్లీ..బ్యాంకులకు క్యూ కడుతున్న రైతులు
- ఇంకా పెండింగ్‌లోనే రేషన్ కార్డు నిర్ధారణకు సంబంధించిన 10 వేల దరఖాస్తులు
- మాఫీ అయ్యేదెన్నడు.. కొత్త రుణాలు తీసుకునేది ఎప్పుడు?
- పంటల పెట్టుబడులకు ఇబ్బ ందులు పడుతున్న జిల్లా రైతాంగం

**వానకాలం ముగియనున్నది. రైతు భరోసా ఊసే లేదు. పంట రుణాలు సైతం చాలా మందికి ఇంకా మాఫీ కాలేదు. ప్రభుత్వం చేపట్టిన సర్వే ఇంకా కొనసా..గుతున్నది. దీంతో రుణమాఫీకి ఇంకెంత కాలం వేచి చూడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆధార్ అనుగుణంగా బ్యాంకు ఖాతాల్లో పేర్ల మార్పిడికి తాజాగా ప్రభుత్వం అవకాశం కల్పించడంతో రైతులు మళ్లీ బ్యాంకులకు క్యూ కడుతున్నారు. మరోవైపు..రేషన్ కార్డుకు సంబంధించిన 10 వేలకు పైగా దరఖాస్తుల సర్వేను ఇంకా చేయాల్సి ఉన్నది. పాత పంట రుణాలు మాఫీ కాక..కొత్త రుణాలు రాక జిల్లా రైతాంగం పెట్టుబడుల కోసం అవస్థలు పడుతున్నది.**

– రంగారెడ్డి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ)

రంగారెడ్డి జిల్లాలో మొదటి విడతలో 49,471 మందికి రూ.257.19 కోట్లు, రెండో విడతలో 22,915 మందికి రూ.218.13 కోట్లు, మూడోవిడతలో 15,226 మంది రైతులకు రూ.185.40 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ మూ డు విడతల్లోనూ కలిపి జిల్లాలోని 87,612 మంది రైతులకు రూ.660.72కోట్ల రుణాలు మాఫీఅ య్యాయి. అయితే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినా తమకు వర్తించలేదని జిల్లాలో వేలాది మంది రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారి ఖాతాలను పరిశీలించినప్పుడు రేషన్‌కార్డు లేదని, చాలామందికి కుటుంబ నిర్ధారణ కావాల్సి ఉందనే కారణాలు తేలాయి. రుణమాఫీ వర్తించని వారి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి జిల్లా వ్యవసాయ అధికారి, డివిజన్, మండల అధికారులు, విస్తరణాధికారులకు పంపించింది. తొలుత గ్రీవెన్స్ సెల్ అ ని, ఆ తర్వాత యాప్ అని ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో రైతులు నెలల తరబడిగా మాఫీ కోసం ఎదురు చూడాల్సి దుస్థితి నెలకొన్నది.

### లోటుపాట్లు.. రైతులకు శాపం..

గత నెల 26 నుంచి రుణమాఫీ సర్వేను చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అధికారులు ఇంటింటికెళ్లి రుణమాఫీ సర్వేను నిర్వహిస్తున్నారు. రుణమాఫీ వర్తించని వారి ఇండ్లకెళ్లి క్షేత్రస్థాయి సమాచారం తెలుసుకుని యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమానితో ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు తీసుకుంటున్నారు. రుణ ఖాతా, బ్యాంకు బ్రాంచ్ వివరాలు, మాఫీ కోసం కుటుంబ సభ్యుల వివరాలను ఇష్టపూర్వకంగా ఇస్తున్నట్లు పేర్కొంటూ సంతకం చేసి కుటుంబ యజమాని ఇవ్వాలని.. దీ న్ని ధ్రువీకరిస్తూ గ్రామ కార్యదర్శి సంతకం చేయా ల్సి ఉంటుందని వ్యవసాయశాఖ నిర్దేశించగా.. ఆ ప్రకారంగా అధికారులు సర్వేను చేపడుతున్నారు. రేషన్ కార్డులేక రుణమాఫీ కాని వారి నుంచి అధికారులకు 17,926 దరఖాస్తులు రాగా..ఇంటింటికెళ్లి పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు 7,233 దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తి కాగా.. ఇంకా 10 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

కేవలం

కుటుంబ నిర్ధారణకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆధార్ మిస్ మ్యాచింగ్, ఇతరత్రా పొరపాట్లు ఉన్న వి బ్యాంకులు చూసుకుంటాయని అధికారులు చెబుతున్నారు. ఆధార్‌కు అనుగుణంగా బ్యాంకు ఖాతాల్లో పేర్ల మార్పిడికి తాజాగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి బ్యాంకులోనూ నోడల్ ఆఫీసర్‌ను నియమించింది. దీంతో రైతులు మళ్లీ బ్యాం కుల బాట పడుతున్నారు. ఇదిలా ఉండగా.. రూ. 2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు పై మొ త్తాన్ని ఎప్పటివరకు చెల్లించాలి? అనే విషయంలోనూ ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వ లోటు పాట్లు వేలాది మంది రైతుల పాలిట శాపంగా మారాయి.

### రుణ..గోస..

వానకాలం పంటల సాగుకు సంబంధించి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు. చాలామంది రైతులు రుణాలను ఏండ్ల తరబడిగా చెల్లించకపోవడంతో మొండి బకాయిదారులుగా మారారు. దీనికి తోడు రుణమాఫీ సైతం కాకపోవడంతో వారికి కొత్తగా రుణా లు అందే పరిస్థితి లేకుండా పోయింది. రుణమాఫీ అయిన తర్వాతే కొత్త రుణాలు ఇస్తామంటూ బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులకు జిల్లా రైతాంగం గోస పడుతున్నది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

## వికారాబాద్ జిల్లాలో రుణమాఫీ కాలేదంటూ ఇప్పటివరకు అందిన దరఖాస్తులు 6,729

- కొనసాగుతున్న ఇంటింటి సర్వే.. 
- ప్రత్యేక యాప్‌లో ఎంట్రీ చేస్తున్నా.. ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు
- బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- రూ.2 లక్షలపై ఉన్న మొత్తాన్ని చెల్లించినా ఇప్పటికీ ఖరారు కాని గైడ్‌లైన్స్.. గందరగోళ ంగా రుణమాఫీ ప్రక్రియ

వికారాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): పంట రుణాలు మాఫీ కాకపోవడంతో జిల్లాలో ఏర్పాటు చేసిన రుణమాఫీ గ్రీవెన్స్‌కు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. రుణమాఫీ కాని రైతుల వివరాల ఆధారంగా వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. అయితే అర్హతలున్నా వేలాది మంది రైతుల రుణాలు మాఫీ కాకపోవడంతో అన్నదాతలు మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలు, ఏడీవో, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఇప్పటికే ఒక్కొక్కరూ నాలుగైదు సార్లు ఫిర్యా దు చేసినా సమస్య పరిష్కారం కాకుండానే మళ్లీ ఇంటింటి సర్వే నిర్వహిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎంత రుణం తీసుకున్నారు..? రెన్యువల్ చేసుకున్నారా..? లేదా..? రేషన్ కార్డు వివరాలు, పట్టా పాసుపుస్తకం, బ్యాంకు ఖాతాలోని పేర్లను పరిశీలించి వ్యవసాయాధికారులు యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. అయితే పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖా తాల్లో వేర్వేరుగా నమోదైన పేర్లను సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో రైతులు గత రెండు రోజులుగా బ్యాంకులకు అధికంగా తరలివస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే వాటి ఎదుట పడిగాపులు గాస్తున్నారు.

### నవాబుపేట మండలంలో అత్యధికంగా..

జిల్లావ్యాప్తంగా గ్రీవెన్స్‌కు ఇప్పటివరకు 6,729 మంది రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. అత్యధికంగా నవాబుపేట మండలం నుంచి వెయ్యికిపైగా అన్నదాతల నుంచి ఫిర్యాదులొచ్చాయి. కాగా జిల్లాలో సుమారు 1.70 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే వారిలో 91,956 మంది రైతుల రుణాలే మాఫీ అయ్యాయి. అయితే మొదటి విడత లో రూ.లక్షలోపు 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్లు, రెండో విడతలో 26,438 మం ది రైతులకు రూ.265.04 కోట్లు, మూడో విడతలో 18,885 మంది రైతులకు రూ.247.71 కోట్ల రుణా లు మాఫీ అయ్యాయి. అయితే మూడు విడతల్లోనూ రుణమాఫీ కాని అర్హులైన వేలాది మంది అన్నదాతలు డీఏవో, ఏడీ, మండల వ్యవసాయాధికారి కా ర్యాలయాల్లో తమ పంట రుణాలు మాఫీ కాలేదం టూ ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదును కూడా ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. అయితే రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవ డం, ఒకరి ఆధార్ నంబర్‌కు బదులు మరొకరి ఆధా ర్ నంబర్‌ను ఎంట్రీ చేయడం, వడ్డీని కలపకుండా రైతులు తీసుకున్న రుణాలను మాత్రమే ఎంట్రీ చేయడం తదితర కారణాలతో జిల్లాలోని దాదాపు 80 వేల మంది రైతులు నష్టపోయారు. మరోవైపు రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతుల పరిస్థితి మరీ గందరగోళంగా తయారైంది. కటాఫ్ రుణానికి మించి ఉన్న రైతుల్లో చాలామంది ఇప్పటికే పైన ఉన్న మొత్తాన్ని చెల్లించి సంబంధిత రసీదులను వ్యవసాయాధికారులకు అందజేసినా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. కటాఫ్ రుణానికి మించి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెప్పడంతో అన్నదాతలు అప్పులు చేసి మరీ ఆ మొత్తాన్ని చెల్లించా రు. అయితే రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలను ఇప్పటివరకు ఖరారు చేయలేదు. ఎప్పటివరకు అన్నదాతలు చెల్లించాలో గైడ్‌లైన్స్ విధించలేదు.

**రుణమాఫీ గ్రీవెన్స్‌కు అందిన ఫిర్యాదులు**

| మండలం | ఫిర్యాదులు |
|---|---|
| నవాబుపేట | 1127 |
| వికారాబాద్ | 425 |
| ధారూరు | 474 |
| మోమిన్‌పేట | 177 |
| కోట్‌పల్లి | 175 |
| మర్పల్లి | 333 |
| పరిగి | 486 |
| పూడూరు | 459 |
| కులకచర్ల | 228 |
| దోమ | 284 |
| తాండూరు | 184 |
| యాలాల | 443 |
| పెద్దేముల్ | 179 |
| బషీరాబాద్ | 248 |
| కొడంగల్ | 287 |
| దౌల్తాబాద్ | 590 |
| బొంరాస్‌పేట | 508 |
| బంట్వారం | 56 |
| చౌడాపూర్ | 66 |
| మొత్తం | 6729 |